# పెన్ పవర్
## తెలంగాణ రౌండప్

శనివారం | 9 ఆగస్టు 2025 | పేజీలు 8


చెరువు నాలాను పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు..



- 125 ఏళ్ళనాటి (1897-99) చారిత్రాత్మక ఫాక్స్‌సాగర్ చెరువు, నాలా కబ్జాలు..
- అలంకార ప్రాయంగా హైడ్రా..! చర్యలు కొందరిపైనే ఉంటాయా..?
- బడా నిర్మాణ సంస్థలకి మినహాయింపు ఎందుకో..చట్టం తెలిసినోళ్ళే ధిక్కరిస్తే..?
- చెరువుల పరిరక్షణ కోసం ముఖ్యమంత్రి ఆలోచనలో భాగంగా "ఆపరేషన్ హైడ్రా"..!
- ఆరంభంలో హడావుడి చేశారు..! ఇప్పుడు ఆదమరిచి నిద్రపోతున్నారు..?

# ఫాక్స్‌సాగర్ ఆక్రమణపై..!
# ఇరిగేషన్ మొక్కుబడి సందర్శన..!

ఫాక్స్‌సాగర్ చెరువు కబ్జాపై పెన్ పవర్ కథనం..




పెన్ పవర్
తెలంగాణ రౌండప్
శుక్రవారం 8 ఆగస్టు 2025 పేజీలు 8
చామకూర కుటుంబం చెరలో..!
ఫాక్స్‌సాగర్ చెరువు..!
మల్లారెడ్డి కుమారుడు ఫాక్స్‌సాగర్ చెరువు అల్లుడు చిన్న దామెర చెరువు కబ్జా..
●జీడిమెట్లలో 125 ఏళ్ళనాటి చారిత్రాత్మక చెరువు ఎఫ్‌టీఎల్ బఫర్ జోన్ కబ్జా..
●దుండిగల్‌లో చిన్న దామెర చెరువు 8-20 ఎకరాలు కబ్జా..
●మాజీ మంత్రి మల్లారెడ్డి సూరారంలో భూగర్భంలో గొలుసు కట్టుకాలువలు..
-2లో
epaperpenpower.in
08 Aug 2025 - Page 1

## బాధ్యతలేని నీటిపారుదల శాఖ..! పత్రికల్లో వస్తేనే..! ఈ సందర్శనలా..?

బహదూర్‌పల్లి బాబాఖాన్ చెరువు నాలాపైనే ప్రైమార్క్ హైరైజ్ టవర్‌లపై పలుమార్లు నివేదికలు మార్చి, చివరికి తప్పుడు నివేదికని సిద్ధంచేశారు.. హైకోర్టు ఉత్తర్వులనే ధిక్కరించే విధంగా.. కేసు తేలకముందే హెచ్‌ఎండిఏ "ఆక్యుపెన్సీ సర్టిఫికేట్" జారీ చేశారు.. ఈ వ్యవహారంలో 88 ఫ్లాట్లు గల ఎ-బ్లాక్ కూల్చివేయకుండా.. కోట్లు చేతులు మారినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి... కోట్లు కమ్మరించే బడా నిర్మాణ సంస్థలకు.. రాజకీయ నాయకులకు, చెరువుల ఆక్రమణలపై, కబ్జాలపై మినహాయింపు ఉందా..? చట్టబద్ధత కల్పించారా..? ఏళ్ళుగడిస్తే సాంకేతికత అభివృద్ధి చెందుతుందేమో..! కానీ చెరువుల విస్తీర్ణం కుంచించుకు పోతుందా..? బీఆర్ఎస్ చెరువులను మింగిందని..! 40 ఏళ్ళనాటి చెరువులు పునరుద్ధరిస్తామని, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం..! ఇప్పుడు ఏం సమాధానం చెబుతుంది..? అప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వం గుప్పిట్లో ఉన్న అధికారులు..! ఇప్పుడు కాంగ్రెస్ గుప్పిట్లో ఉన్నారు అంతే..! తేడా ఏముందో చెబుతారా..? ఇందుకోసమేనా తెలంగాణ స్వ రాష్ట్ర సాధన..? ఇందుకోసమేనా తెలంగాణ బిడ్డల బలిదానం..? బాధ్యులైన ప్రతిఒక్కరూ మూల్యం చెల్లించుకోక తప్పదు.. శ్రీకృష్ణ జన్మస్థానం సందర్శించక మానదు..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, ఆగస్టు 8:** హైదరాబాద్ మహానగరాన్ని జలసమాధి చేస్తారా..? హైడ్రాకు చైర్మన్‌గా వ్యవహరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నప్పటికీ..! విపక్షాల నుండి విమర్శన అస్త్రాలు సంధిస్తున్నా..! అధికారుల్లో ఇంత నిర్లక్ష్యం ఎందుకు..? చెరువులు, నాలాలు, గొలుసుకట్టు కాలువలు, కాపాడుతున్నారా..? కాజేస్తున్నారా..? ఒక్క రోజు వర్షానికే నగరాన్ని అతలాకుతలం చేసేస్తోంది.. పడవల్లో హైడ్రా కమిషనర్ పరిశీలన చూస్తున్నాం..! ఇంత బహిరంగంగా చారిత్రక చెరువును ఆక్రమించి, అపార్ట్‌మెంట్ నిర్మాణాలు వెలుస్తుంటే..! పలుకుబడి ఉపయోగించి, అధికారపార్టీ నేతలకు, సంబంధిత అధికారులకు ముడుపులు ముట్టజెప్పి ఫాక్స్‌సాగర్ నాలాపైనే అక్రమ కట్టడాలకు బిల్డర్‌లు తెర లేపుతుంటే..! అధికారులు లంచావతారులుగా అవతారమెత్తి..! బహిరంగ దోపిడీకి పాల్పడుతున్నారని ఫిర్యాదులు చేసినా పట్టించుకోని అధికారులని ఇంకేమంటారు..? అధికారుల ముసుగులో చెరువులు, చెరబట్టే కేటుగాళ్ళకు వత్తాసుపలికే అధికార యంత్రాంగాన్ని ఏమని పిలవాలని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు..! మాజీ మంత్రి కొడుకు ఫాక్స్‌సాగర్ చెరువు ఆక్రమణకి, 2022లో అనుమతులు జారీచేసిన హెచ్‌ఎండిఏ, మున్సిపల్ అధికారులు సైట్ వెరిఫికేషన్‌లో చెరువు కనిపించలేదా..? ఇరిగేషన్ "ఎన్‌వోసి" ఎలా జారీచేశారు..? ఎన్‌వోసి లేకపోతే నిర్మాణాలు ఎలా కొనసాగుతున్నాయి..? ఏమి తెలియనట్టు పరిశీలించిన నీటిపారుదల శాఖ, నివేదిక ఎటువైపు..?

- కబ్జాను పరిశీలించేందుకు.. మ్యాప్ తీసుకు పోలేదని సమాధానం..?
- యుద్ధానికి వెళ్ళిన సైనికులు.. కత్తి, డాల్ మరిచి పోయారట..!
- అధికారుల మొక్కుబడి సందర్శన ఎవరిని ఉద్ధరించడానికి..?
- పాలకుల నిర్లక్ష్యం..! అధికారుల బరితెగింపుకి నిదర్శనం ఈ కబ్జా..



ఫాక్స్‌సాగర్ చెరువు కబ్జాను పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు..

## నేను ఒక్కడినే భాజపాలో చేరుతున్నా



**హైదరాబాద్ పెన్ పవర్:** భాజపా సిద్ధాంతం, లక్ష్యం నచ్చే ఆ పార్టీలో చేరనున్నట్లు మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు తెలిపారు. భాజపా రాష్ట్ర కార్యాలయానికి వెళ్లిన ఆయన ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావుతో భేటీ అయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఆగస్టు 10న భాజపా రాష్ట్ర చీఫ్ రామచందర్‌రావు సమక్షంలో తాను ఒక్కడినే ఆ పార్టీలో చేరుతానని చెప్పారు. అచ్చంపేటలో ఎవరు ఎన్ని సభలు, సమావేశాలు పెట్టుకున్న తనని ఏమీ చేయలేరని వ్యాఖ్యానించారు.

## ఓఆర్ఆర్ వరకు వరదనీటి సమస్య ఉండొద్దు


**హైదరాబాద్ పెన్ పవర్:** నగరంలో వర్షాలు, వరదల ప్రభావంపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. వర్షాలతో ప్రజలు పడుతున్న ఇబ్బందులు, వరద సమస్యకు శాశ్వత పరిష్కారంపై ఆరా తీశారు. గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి హైదరాబాద్‌లో తలెత్తిన పరిస్థితులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

వరద ప్రవాహానికి అడ్డంకుల వల్లే ఈ దుస్థితి తలెత్తుతోందని అధికారులు వివరించారు. ఓఆర్ఆర్ వరకు వరదనీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. వరదనీరంతా మూసీకి చేరేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. చెరువులు, నాలాలు, కాలువలన్నీ మూసీకి అనుసంధానించాలన్నారు. చెరువుల పునరుద్ధరణ, నాలాల వెడల్పు త్వరగా పూర్తి చేయాలని సూచించారు.



# ఫాక్స్‌సాగర్ ఆక్రమణపై..! ఇరిగేషన్ మొక్కుబడి సందర్శన..!

**ఫాక్స్‌సాగర్ చెరువు కబ్జాలు బలిసినోళ్ళకు మినహాయింపులు.. సామాన్యులకు మాత్రం శిక్షలు.. ఫాక్స్‌సాగర్ చెరువు కబ్జాలో మాజీ మంత్రి మల్లారెడ్డి కుమారుడు భద్రారెడ్డి ఉన్నాడని, ఇరిగేషన్ అధికారులకు మూడేళ్ళుగా తెలియదా..? శుక్రవారం ఆకుల సతీష్ ఫిర్యాదు, పత్రికా కథనాలతో..! రిగేషన్ అధికారుల సందర్శన, పరిశీలన కేవలం మొక్కుబడి కోసమేనా..? దుండిగల్ చినదామెర చెరువు కబ్జాను నిర్ధారించి భారీ యంత్రాలతో కూల్చివేతలు.. ఆతర్వాత దాని ఊసేలేదు.. సూరారం కట్టమైసమ్మ చెరువులోనూ,కట్ట దిగువభాగం కబ్జా.. ఫాక్స్‌సాగర్ నాలాపై "తిరుమల హైట్స్" అపార్ట్‌మెంట్.. కొత్తగా మార్వాడికి చెందిన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం.. సీజింగ్‌లు, కేసులు, అయినప్పటికీ అధికారులకు, కొందరు నాయకులకు, భారీగా ముడుపులతో అక్రమ కట్టడాలు అద్దెకు కూడా ఇచ్చారు.. కొత్తగా జేకేనగర్‌లో కూల్చేసిన ఫాక్స్‌సాగర్ నాలా ఆక్రమణలను మళ్ళీ నిర్మించినా, అధికారులు "లంచాలకే" ప్రాధాన్యత ఇస్తున్నారు.**




**2018లో 100 ఫీట్ల వెడల్పు, ఇరువైపులా 30o30 బఫర్.. ఉండాలని అధికారుల స్కెచ్‌ప్లాన్..**




**ఫాక్స్‌సాగర్ చెరువు నాలాపైనే ఈ నిర్మాణం మొత్తం..**

## ఫాక్స్‌సాగర్ చెరువు కబ్జా వివరాలు..

కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నెంబర్ 151, 179 లో ఫాక్స్‌సాగర్ చెరువు ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్‌లో దాదాపు 3800 గజాల పైచిలుకు స్థలంలో భారీ భవన్ నిర్మాణానికి తప్పుడు పత్రాలతో అక్రమ అనుమతులు, అండ్ నిర్మాణంపై తక్షణమే చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, హెచ్ఎండిఏ, ఇరిగేషన్, కొంపల్లి మున్సిపల్ కమిషనర్‌కి సతీష్ ఫిర్యాదు చేశారు.. సర్వే నెంబర్. 151, 179 లో, ప్లాట్ నెంబర్ 504, 505 కొంపల్లి గ్రామం దుండిగల్ మండలంలో ఫాక్స్‌సాగర్ చెరువు యొక్క ఎఫ్.టి.ఎల్ మరియు బఫర్ జోన్ ఎఫ్‌టిఎల్ కోఆర్డినేట్స్ (%ూ 61 శీ~ూ%63) లో 3823 వదరపు మీటర్ల విస్తీర్ణంలో "స్టిల్ట్ ప్లస్ 5" అంతస్తుల భారీ భవన్ నిర్మాణానికి మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి కుమారుడు చామకూర భద్రారెడ్డి మరియు ఇతరులు కలిసి(శ్రీ షిరిడి సాయి బిల్డర్స్) హెచ్ఎండిఏ నుంచి టిజి-బిపాస్ ద్వారా 2022లోనే అక్రమంగా అనుమతులు పొందటం విశేషం.(006398/BP/HMDA/1267/MED/2022 dt:02-11-2022). ఫాక్ సాగర్ చెరువు ఎఫ్‌టిఎల్ కోఆర్డినేట్స్ "ఎ-61 నుంచి ఎ-63" వరకు..! ప్రస్తుతం భవన నిర్మాణం జరుగుతున్న 90 శాతం భవనం పూర్తిగా ఎఫ్టిఎల్, బఫర్ జోన్‌లోనే ఉన్నప్పటికీ..! ఇరిగేషన్, మున్సిపల్, హెచ్ఎండిఏ, రెవెన్యూ అధికారులు ఏ విధంగా అనుమతులు ఇచ్చారో తేల్చాల్సి ఉంది..

- **మొదటి పేజి తరువాయి**

మేడ్చల్ జిల్లా దుండిగల్ మండల పరిధిలోని ఫాక్స్‌సాగర్ చెరువు ఆక్రమణలో మాజీ మంత్రి మల్లారెడ్డి తనయుడి అపార్ట్‌మెంట్‌లు వివాదాస్పదంగా తయారయ్యాయి..

ఫాక్స్‌సాగర్ చెరువును చేరబట్టిన చామకూర కుటుంబంపై సంబంధిత అధికారులకు, ఆకుల సతీష్ ఫిర్యాదు, పత్రికల్లో వచ్చిన వార్తా కథనాలకు ఉన్నతాధికారులు స్పందించక తప్పలేదు..! చెరువు కబ్జాను సందర్శించిన అధికారులు పనులు నిలిపివేసి, పత్రాలు తీసుకుని ఆఫీసుకి రమ్మని చెప్పారట.. శుక్రవారం సంబంధిత స్థలాన్ని సందర్శించి, సర్వే పరిశీలించిన ఇరిగేషన్ 'డీఈఈ' ఉదయ భాస్కర్ అండ్ ఇరిగేషన్ అధికారులు, ఎఫ్‌టిఎల్ బఫర్ జోన్‌లో ప్రాథమికంగా నిర్వహించిన సర్వేలో, నిర్మాణం ఉన్నట్లు నిర్ధారణకు వచ్చిన అధికారులు.. నిర్మాణ పనులు చేయకూడదని ఆదేశించారు.. కన్‌స్ట్రక్షన్‌కి సంబంధించిన అనుమతి పత్రాలను, కార్యాలయంలో సమర్పించాలని ఆదేశించినట్లు సమాచారం..



**పూర్తయిన ఆ నిర్మాణం ఇక్కడే..**



**ఫాక్స్‌సాగర్ నాల బఫర్ జోన్‌లో జీహెచ్ఎంసి పర్మిషన్, ఇరిగేషన్, రెవెన్యూ, చర్యలు నిల్.. జేకేనగర్‌లో**



**ఫాక్స్‌సాగర్ నాలాపై తిరుమల హైట్స్, అపార్ట్‌మెంట్.. ఓ ఎమ్మెల్యే, మాజీ మంత్రి అండతో..**

## బీహార్ లో దారుణం... బస్సులో విదేశీ యువతిపై అత్యాచారం

- పాట్నాలో ప్రైవేట్ బస్సులో నేపాల్ యువతిపై అత్యాచారం
- ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు
- బాధితురాలికి తెలిసిన నేపాలీ భాష మాట్లాడి నమ్మించిన బస్సు డ్రైవర్
- ఉద్యోగం ఇప్పిస్తానని బస్సులోకి తీసుకెళ్లి దారుణం



**హైదరాబాద్ పెన్ పవర్:**బీహార్ రాజధాని పాట్నాలో నేపాల్‌కు చెందిన యువతిపై ఓ ప్రైవేట్ బస్సులో అత్యాచారం జరిగింది. ఈ కేసులో పోలీసులు వేగంగా స్పందించారు. పరారీలో ఉన్న ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి కేసును ఛేదించారు. బాధితురాలికి తెలిసిన నేపాలీ భాష మాట్లాడి నమ్మకాన్ని చూరగొన్న ప్రధాన నిందితుడు, ఆమె నిస్సహాయతను ఆసరాగా తీసుకుని ఈ దారుణానికి పాల్పడ్డాడు.

పాట్నా సెంట్రల్ ఎస్పీ దీక్ష వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ కేసులో ప్రధాన నిందితుడైన కార్తీక్ రాయ్, అతడికి సహకరించిన సునీల్ కుమార్‌ను అరెస్ట్ చేశారు. ఆగస్టు 4న ఈ దారుణం జరిగిన తర్వాత నిందితులు నగరం విడిచి పారిపోయారు. ప్రధాన నిందితుడు కార్తీక్ రాయ్ పశ్చిమ బెంగాల్‌కు పారిపోయేందుకు ప్రయత్నిస్తుండగా, బరౌనీ సమీపంలో ఒక రైల్లో అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి బాధితురాలి గుర్తింపు కార్డు, నేపాలీ సిమ్ కార్డు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. కార్తీక్ ఇచ్చిన సమాచారంతో, అతనికి సహకరించిన సునీల్ కుమార్‌ను ఔరంగాబాద్‌లో అరెస్ట్ చేశారు.

పోలీసుల దర్యాప్తులో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. ముజఫర్‌పూర్‌కు చెందిన బస్సు డ్రైవర్ కార్తీక్ రాయ్‌కి నేపాలీ భాష తెలుసు. అతనికి అప్పటికే వివాహమై ఒక కుమారుడు ఉన్నాడు. కుటుంబ సభ్యుల ఒత్తిడితో డబ్బు సంపాదించేందుకు నేపాల్ నుంచి వచ్చిన బాధితురాలు, ఆగస్టు 3న సిలిగురి మీదుగా పాట్నాకు చేరుకుంది. పాటలీపుత్ర రైల్వే స్టేషన్‌లో ఆమెకు కార్తీక్ పరిచయమయ్యాడు. ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి, సునీల్ కుమార్ ఇంటికి తీసుకెళ్లాడు. ఆ తర్వాత ఆమెను బస్సులోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడని ఎస్పీ దీక్ష తెలిపారు.

నేరం జరిగిన తర్వాత సాక్ష్యాలను నాశనం చేసేందుకు నిందితులు బస్సును శుభ్రం చేశారు. బాధితురాలి వస్తువులను దోచుకున్న కార్తీక్, వాటిలో కొన్నింటిని కోల్‌కతాలో అమ్మి, తిరిగి ముజఫర్‌పూర్‌కు వచ్చాడు. మళ్లీ కోల్‌కతాకు పారిపోయేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులకు చిక్కాడు. గాంధీ మైదాన్ సమీపంలో బాధితురాలు ఏడుస్తూ కనిపించడంతో స్థానిక దుకాణదారులు, గోరా? రెజిమెంట్ జవాన్లు గమనించారు. వారు గోరా? సమాజ్ సమితి అధ్యక్షుడు సూరజ్ థాపాకు సమాచారం అందించగా, ఆయన బాధితురాలిని చేరదీసి పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సహాయం చేశారు. ఈ ఘటనలో ఉపయోగించిన బస్సును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఇంకెవరికైనా ప్రమేయం ఉందా అనే కోణంలో దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# పండుగ సాయన్న జయంతి వేడుకలు..

## నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు..



**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, ఆగస్టు 8:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం చౌరస్తాలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పండుగ సాయన్న జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పలువురు ముదిరాజ్ బిడ్డలు పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.. ఈ సందర్బంగా పలువురు మాట్లాడుతూ... తెలంగాణ రాబిన్ హుడ్‌గా, ప్రజా వీరుడిగా ఆయనను కీర్తించారు.. పండుగ సాయన్న పేద ప్రజలకు అండగా నిలబడి ఆధిపత్య వర్గాలపై పోరాటం చేశాడన్నారు. భారత స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో..! నిజాం నిరంకుశత్వానికి, జరిగిన తిరుగుబాటు ఉద్యమాల్లో ఆయన పోరాటం ఒక చరిత్ర పుటల్లో లిఖించబడినదని కొనియాడారు.. నాడు బహుజనుల ఐక్యత అభివృద్ధికై పండుగ సాయన్న ఆధ్వర్యంలో సహపంక్తి భోజన కార్యక్రమాలు వంటివి ఏర్పాటు చేసి బహుజన పేద ప్రజల ఆకలిని తీర్చారన్నారు.. ఆయన 38 ఏళ్ళ జీవిత చరిత్రను పాఠ్య పుస్తకాలలో చేర్చి రాబోయే తరాలకు ఆయన చరిత్రను తెలియజేయాలన్నారు. పండుగ సాయన్న జయంతి, వర్ధంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించి, ఆయన విగ్రహాల ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షులు దొంతుల రమేష్ ముదిరాజ్ , ముదిరాజ్ జర్నలిస్ట్ సంఘం మేడ్చల్ జిల అధ్యక్షులు సుగ్రీవుడు ముదిరాజ్ , కార్యదర్శి బక్కని పాండురంగం ముదిరాజ్, ఎన్.ఎం.ఆర్ యువసేన కుత్బుల్లాపూర్ అధ్యక్షులు పుట్టి శివ ముదిరాజ్ , ముదిరాజ్ యువ నాయకులు విష్ణువర్ధన్ ముదిరాజ్ , కిష్టయ్య ముదిరాజ్, భూపేష్ ముదిరాజ్, గోపాల్ ముదిరాజ్, సంజయ్ ముదిరాజ్, కార్తీక్ ముదిరాజ్, దత్తు ముదిరాజ్ తదితరులు, స్థానికులు పాల్గొన్నారు.

# హరిహర క్షేత్రంలో ఘనంగా శుక్రవారం పూజలు

## అమ్మవారిని దర్శించుకునేందుకు తరలివచ్చిన భక్తులు



**ఎల్బీనగర్ పెన్ పవర్ ఆగష్టు 8:**శ్రావణ శుక్రవారం సందర్భంగా ఎల్బీనగర్ నియోజకవర్గం కర్మన్ ఘాట్ లోని శ్రీశ్రీశ్రీ హరిహర క్షేత్ర అయ్యప్పస్వామి దేవాలయ ప్రాంగణంలో ఉన్న శ్రీ పార్వతిదేవి అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా దేవాలయానికి తెల్లవారుజామున నుండే భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో దేవాలయ వ్యవస్థాపకులు వంగ మధుసూదన్ రెడ్డి, ధర్మకర్తలు, సిబ్బంది శ్రీనివాస్, అర్చకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ఇండియా ఎవరి ముందూ మోకరిల్లదు.. EFTA ఒప్పందంతో 84 లక్షల కోట్ల పెట్టుబడులు.. అత్యధిక ఎగుమతులతో వృద్ధి

**హైదరాబాద్ పెన్ పవర్:**టారిఫ్స్ పేరుతో ఇండియను నయానో భయానో లొంగదీసుకోవాలనుకుంటున్న యూఎస్ ప్రెసిడెంట్ ట్రంప్ ప్రయత్నాలను ఇండియా తిప్పి కొడుతోంది. రష్యా నుంచి ఆయిల్ దిగుమతులను ఆపేయాలని.. లేదంటే డబుల్ టారిఫ్ లు తప్పవని హెచ్చరిస్తూ వస్తున్నారు. ఇండియా ఎవరి దగ్గర నుంచి ఏం దిగుమతి చేసుకోవాలో అమెరికా నిర్దేశించలేదని ఇప్పటికే స్పష్టం చేసిన ఇండియా.. లేటెస్టుగా.. ఇండియా ఎవరి ముందు మోకరిల్లదని గట్టి సమాధానం పంపింది.

ట్రంప్ ఆర్డర్స్ ను లెక్క చేయకుండా ఇప్పటికే రష్యా నుంచి క్రూడ్ ఆయిల్ కొనుగోలును కొనసాగిస్తోంది ఇండియా. ఈ సందర్భంగా ఇండియా ఎవరి ముందు తల వంచదని కామర్స్ మినిస్టర్ పీయూష్ గోయల్ అన్నారు. శుక్రవారం (ఆగస్టు 08) బిజినెస్ టుడే ఏ100 సమ్మిట్ లో పాల్గొన్న ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు.

ఇండియా ఎగుమతులు, దిగుమతులపై ఎవరూ ప్రభావం చూపలేరని అన్నారు కేంద్ర మంత్రి పీయూష్ గోయల్. ఇప్పటికే భారత్ 6.5 శాతం వృద్ధితో ఈ ఏడాది అత్యధిక ఎగుమతులతో ముందుకు వెళ్తోందని చెప్పారు. అమెరికా లాంటి దేశాల టారిఫ్స్, సాంక్షన్స్ కారణంగా వాణిజ్యంలో డీ గ్లోబలైజేషన్ అవుతోందని వస్తున్న వార్తలను ఆయన ఖండించారు. ఒక దేశం సాంక్షన్స్ విధిస్తే దేశాల పార్టనర్ షిప్ మారుతుందని అన్నారు. ఇప్పటి వరకు ఉన్న దేశాల పార్టనర్షిప్ మారి.. ఇతర దేశాలతో వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటాయని తెలిపారు.

# ఫస్ట్ టైం బాబు అక్కడికి వెళ్తున్నారు !

**హైదరాబాద్ పెన్ పవర్:**ముఖ్యమంత్రి చంద్రబాబు తొలిసారి ఒక ప్రాంతానికి వెళ్తున్నారు. ఆయన తొలిసారి వెళ్ళడమేంటి అని అనుకోవచ్చు. సుదీర్ఘకాలం ఉమ్మడి ఏపీకి విభజన ఏపీకి సీఎం గా ఉన్న బాబు పర్యటించని ప్రాంతాలు లేవు అని అంతా అంటారు. ఇక ఒకసారి కాదు అనేక సార్లు బాబు ఏపీలో చాలా ప్రాంతాలలో పర్యటించారు. అయితే ఆయన నాలుగవ సారి సీఎం అయిన తరువాత తొలిసారి ఆ ప్రాంతానికి వస్తున్నారు అన్నదే ఇక్కడ వార్తా విశేషం. ఇంతకీ ఆ ప్రాంతం ఏంటి అంటే ఉమ్మడి ఏపీలోని గిరిజన ప్రాంతం అయిన పాడేరు.

**అల్లూరి జిల్లాకు సీఎం గా :**

అల్లూరి జిల్లాగా ఏర్పాడిన తరువాత తొలిసారి బాబు పాడేరుకు వస్తున్నారు. ఆయన పర్యటన షెడ్యూల్ ఖరారు అయింది. ఈ నెల 9న అంటే శనివారం బాబు పాడేరులో పర్యటిస్తారు. దానికి తగిన ఏర్పాట్లు అయితే పూర్తి అయ్యాయి. ప్రపంచ ఆదీవాసీ దినోత్సవం సందర్భంగా బాబు పాడేరుకు వస్తున్నారు. గిరిజన ప్రాంతం నుంచే ఆయన ఆదివాసీలకు పెద్ద ఎత్తున వరాలు ప్రకటిస్తారు అని అంటున్నారు.

**ఇదీ షెడ్యూల్ :**



ఇక చూస్తే కనుక ముఖ్యమంత్రి శనివారం ఉదయం పది గంటలకు పాడేరు మండలం లగిసపల్లిలో ఏర్పాటుచేసిన హెలిప్యాడ్ కు చేరుకుంటారు. ఆయన అక్కడ నుంచి 10.25 గంటలకు వంజంగి గ్రామానికి బయలుదేరి వెళతారు. వంజంగి గ్రామంలో దేవాలయ సందర్శన తో పాటు ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో భాగంగా గిరిజనులతో భాగస్వామ్యం ఉంటుంది. వారి గృహాలను సైతం బాబు ముఖ్యమంత్రి హెూదాలో సందర్శిస్తారు. అంతే కాదు గిరిజనులు స్వయంగా పండిస్తున్న పంటలను అడిగి తెలుసుకుంటారు. కాఫీ తోటల రైతులతో చంద్రబాబు ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారు.

**అనేక ప్రారంభోత్సవాలు**

అదే విధంగా చంద్రబాబు దాదాపు మూడు గంటల పాటు వంజంగి గ్రామంలోనే ఉంటారు. అక్కడ ప్రజావేదిక నుంచే ముఖ్యమంత్రి అనేక అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలతో పాటు పలు ఒప్పందాలపై సంతకాలు చేస్తారు. ఇక చంద్రబాబు బహిరంగ సభలో గిరిజనులకు ఎన్నో వరాలు ఇస్తారని అంటున్నారు. ఇలా విశాఖ జిల్లా ఏజెన్సీలో సీఎం చంద్రబాబు బిజీ షెడ్యూల్ ఉండనుంది. ఆయన మధ్యాహ్నం అక్కడి నుంచి రోడ్డు మార్గం ద్వారా బయలుదేరి మధ్యాహ్నం రెండున్నర గంటలకు లగిసపల్లిలోని హెలిప్యాడ్ కు చేరుకొని విజయవాడకు బయలుదేరి వెళతారు.

**ఫోకస్ అటు వైపే :**

ఉత్తరాంధ్ర మొత్తం అసెంబ్లీ సీట్లూ ఎంపీ సీట్లూ కూటమి వశం అయినా పాడేరు అరకు అసెంబ్లీ సీట్లూ అలాగే అరకు ఎంపీ సీటూ వైసీపీకి దక్కాయి దాంతో గిరిజనంతో మమేకం కావడం ద్వారా వాటిని తమ వైపు తిప్పుకోవాలన్న ఆలోచన అయితే కూటమిలో ఉందని అంటున్నారు. ఇప్పటికే అనేక సార్లు ఉప ముఖ్యమంత్రి హెూదాలో పవన్ కళ్యాణ్ పాడేరు అరకు పర్యటనకు చేపట్టారు. చంద్రబాబు మాత్రం నాలుగవ సారి సీఎం అయ్యాక రావడం ఇదే తొలిసారి. దాంతో వైసీపీకి కంచుకోట లాంటి ఏజెన్సీలో బాబు పర్యటన ఆసక్తిని రేపుతోంది.

# రాహుల్ ఎఫెక్ట్.. 4 రాష్ట్రాల ఈసీ వెబ్ సైట్లు డౌన్..? ఏం జరుగుతోంది?

**హైదరాబాద్ పెన్ పవర్:**కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పెద్ద తేనె తుట్టెనే కదిపారా? ఏకంగా రాజ్యాంగబద్ద సంస్థ ఎన్నికల సంఘం (ఈసీ) విశ్వసనీయతను ప్రశ్నార్థకం చేశారా..? ఈ దెబ్బకు ఓటరు లిస్టు వెబ్ సైట్ లు డౌన్ అయ్యాయా..? పరిణామాలను చూస్తుంటే ఔనని అనిపిస్తోంది. గురువారం ఢిల్లీలో రాహుల్ ప్రెస్ మీట్.. శుక్రవారం బెంగళూరులో నిరసన ర్యాలీ నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది.

**ఆ రెండు కీలక రాష్ట్రాల్లో..**

దాదాపు రెండేళ్ల కిందట జరిగిన కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో అప్పటి అధికార బీజేపీ ఓడిపోయింది. కాంగ్రెస్ పార్టీ గెలుపొందింది. కానీ, 15 నెలల కిందట జరిగిన లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ అధిక సీట్లు గెలుచుకుంది. ఇక గత ఏడాది చివర్లో జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లోనూ బీజేపీ గెలుపు ఎవరూ ఊహించనిదే. అంతకు ఆరు నెలల ముందు లోక్ సభ ఎన్నికల్లో తక్కువ సీట్లకు పరిమితమైంది మహాయుతి (బీజేపీ–శివసేన–ఎన్సీపీ) కూటమి. కానీ, అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక స్ట్రయిక్ రేట్ తో గెలుపొందింది.

**ఓట్ల చోరీ ఆరోపణలతో..**

కర్ణాటక లోక్ సభ, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో భారీగా ఓట్ల చోరీ జరిగిందని, దీనికి ఎన్నికల సంఘ (ఈసీ) కారణం అంటూ సాక్షాత్తు లోక్ సభలో ప్రతిపక్ష నేత, ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలు చేశారు. మొదటినుంచి మోదీ ప్రభుత్వం రాజ్యాంగ




సంస్థలను గుప్పిట్లో పెట్టుకుని ఆరోపిస్తున్నారు రాహుల్. తాజాగా ఎన్నికల సంఘం ఆయన టార్గెట్ గా మారింది. రాహుల్ వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా చర్చనీయం అవుతున్నాయి.

**స్వతంత్రతకు మచ్చ..**

రాజ్యాంగబద్ధ సంస్థ అయిన ఎన్నికల సంఘం (ఈసీ)ను రాహుల్ గతంలో పదపదే టార్గెట్ చేశారు. అప్పటికంటే ఈసారి మరింత పదును పెంచారు. ఆయన ఆరోపణలతో స్వతంత్ర సంస్థగా చెప్పుకొంటున్న ఈసీ ఆత్మరక్షణలో పడింది. దీనికి నిదర్శనం.. రాహుల్ గాంధీ ప్రెస్ మీట్ పెట్టి ప్రజంటేషన్ ఇస్తుండగానే కర్ణాటక, మహారాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారులు ఆయనకు సవాళ్లు విసిరారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం ప్రమాణం చేసి అఫిడవిట్ సమర్పించాలని, లేకపోతే దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని ట్వీట్లు చేయడంతో పాటు రాహుల్ కు లేఖలు పంపారు. అయితే, దీనిపై వెనక్కితగ్గేది లేదని కాంగ్రెస్ పార్టీ తేల్చేసింది. ఈ క్రమంలో రాహుల్ తదుపరి ప్లాన్ ఏంటో తెలియక మల్లగుల్లాలు పడుతున్న ఎన్నికల కమిషన్ వర్గాలు తదుపరి చర్యలపై దృష్టిసారించినట్లు తెలుస్తోంది.

**ఆ నాలుగు రాష్ట్రాల సైట్ల డౌన్...**

శుక్రవారం ఉదయం నుంచి మహారాష్ట్ర, రాజస్థాన్, మధ్యప్రదేశ్, బిహార్ రాష్ట్రాల ఎన్నికల ప్రధానాధికారుల వెబ్ సైట్లు పనిచేయడం లేదు. వీటినుంచి రాహుల్ గాంధీ ఎన్నికల డేటా తీసుకుని బయటపెడతారనే మూసేశారని కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. ఇంత జరుగుతున్నా వివరణ ఇచ్చేందుకు ఈసీ సిద్దంగా లేదు. దీంతో కాంగ్రెస్ నాయకుల అనుమానాలకు బలం చేకూరింది.

–ఈసీ నిష్పాక్షికత ప్రదర్శన ప్రారంభమైందిలిలి అని కాంగ్రెస్ ఎంపీ రణదీప్ సూర్జేవాలా వెటకారం ఆడారు. రాహుల్ ఆరోపణలు చేయగానే... నాలుగు రాష్ట్రాల ఈ–ఓటర్ పేజీలు డౌన్ అయ్యాయని ఆరోపించారు. కాంగ్రెస్ నేతలు పలువురు రాహుల్ గాంధీ ఆరోపణల వీడియోలను ట్వీట్లు చేస్తున్నారు. ఆయన ఆరోపణలకు జవాబు చెప్పాలని ఈసీని కోరుతున్నారు.

–నిరుడు మహారాష్ట్ర, అంతకుముందు మధ్యప్రదేశ్, రాజస్థాన్ అసెంబ్లీల ఎన్నికలు జరిగాయి. వీటన్నిట్లోనూ బీజేపీ అధికారంలోకి వచ్చింది. మహారాష్ట్ర, రాజస్థాన్ లో కాంగ్రెస్ నుంచి అధికారం చేజిక్కించుకుంది. మరీ మధ్యప్రదేశ్, మహారాష్ట్రలో బీజేపీ గెలుపు అందరినీ ఆశ్చర్యపరిచింది.

# ట్రంప్ హెచ్చరికలతో స్టాక్ మార్కెట్ బేజారు... 80,000 దిగువకు సెన్సెక్స్!

- అమెరికా సుంకాల భయాలతో కుప్పకూలిన స్టాక్ మార్కెట్లు
- మూడు నెలల కనిష్ఠ స్థాయికి పతనమైన సూచీలు
- సెన్సెక్స్ 765, నిఫ్టీ 232 పాయింట్లు నష్టం
- అన్ని రంగాల్లోనూ వెల్లువెత్తిన అమ్మకాల ఒత్తిడి
- విదేశీ సంస్థాగత మదుపరుల అమ్మకాలు మరింత ఉద్ధృతం




**హైదరాబాద్ పెన్ పవర్:**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన టారిఫ్‌ల భయాలతో భారత స్టాక్ మార్కెట్లు శుక్రవారం కుప్పకూలాయి. అన్ని రంగాల్లోనూ అమ్మకాలు వెల్లువెత్తడంతో సూచీలు భారీగా పతనమయ్యాయి. ఫలితంగా, సెన్సెక్స్ కీలకమైన 80,000 మార్క్ కిందకు పడిపోయి, మూడు నెలల కనిష్ఠ స్థాయికి చేరింది. మదుపరులు తీవ్ర నష్టాలను చవిచూశారు.

భారత్ నుంచి వచ్చే దిగుమతులపై 50 శాతం సుంకం విధిస్తున్నామని, రష్యా నుంచి చమురు దిగుమతిని కొనసాగిస్తే ఈ టారిఫ్‌లను మరింత పెంచుతామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈ ప్రకటన దేశీయ మార్కెట్లలో తీవ్ర ఆందోళనకు దారితీసింది. దీనికి తోడు విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్ఐఐలు) నిరంతరాయంగా తమ పెట్టుబడులను ఉపసంహరించుకోవడంతో పతనం మరింత తీవ్రమైంది. శుక్రవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 765.47 పాయింట్లు నష్టపోయి 79,857.79 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్ సమయంలో ఒక దశలో 79,775 పాయింట్ల కనిష్ఠ స్థాయిని కూడా తాకింది. అదేవిధంగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 232 పాయింట్లు కోల్పోయి 24,363.30 వద్ద ముగిసింది. "అమెరికా సుంకాల ప్రభావం భారత ఎగుమతులపై ఎలా ఉంటుందోనన్న ఆందోళనలతో మార్కెట్లు భారీగా పతనమయ్యాయి. ఎఫ్ఐఐలు నికర అమ్మకందారులుగా కొనసాగడం ఒత్తిడిని మరింత పెంచింది. ఈ పరిణామాల నేపథ్యంలో అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు కూడా భారత్ ఆర్థిక వృద్ధి అంచనాలను తగ్గించడం ప్రారంభించాయి" అని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.

ఈ అమ్మకాల ఒత్తిడి అన్ని రంగాలపైనా ప్రభావం చూపింది. ముఖ్యంగా రియల్టీ, మెటల్, ఆటో, ఐటీ, బ్యాంకింగ్ షేర్లు తీవ్రంగా నష్టపోయాయి. సెన్సెక్స్ బాస్కెట్‌లో భారతీ ఎయిర్‌టెల్, టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, రిలయన్స్, ఇన్ఫోసిస్ వంటి ప్రధాన షేర్లు నష్టాల్లో ముగిశాయి. ఎన్‌టీపీసీ, టైటాన్ వంటి కొన్ని షేర్లు మాత్రమే లాభపడ్డాయి.

సాంకేతికంగా చూస్తే, నిఫ్టీ కీలకమైన 100-రోజుల చలన సగటు (డీఎంఏ) అయిన 24,500 స్థాయి కిందకు పడిపోయిందని, ఇది ఇప్పుడు తక్షణ అవరోధంగా పనిచేస్తుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. మార్కెట్ ధోరణి బలహీనంగా ఉందని, 24,050 వద్ద తదుపరి మద్దతు లభించవచ్చని సెంట్రమ్ బ్రోకింగ్‌కు చెందిన నీలేష్ జైన్ అభిప్రాయపడ్డారు. వరుసగా ఆరో వారంలోనూ మార్కెట్లు నష్టాలతోనే ముగియడం గమనార్హం.

## క్షమాపణ చెప్పు.. లేకుంటే కోర్టుకు లాగుతా : కేటీఆర్





**హైదరాబాద్ పెన్ పవర్:**ఫోన్ టాపింగ్ వ్యవహారంలో బండి సంజయ్ చేసిన తన అడ్డగోలు, చిల్లర వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలకు లీగల్ నోటీసు పంపనున్నట్లు కేటీఆర్ తెలిపారు. బండి సంజయ్ 48 గంటల్లోగా క్షమాపణ చెప్పాలి.. లేకుంటే బండి సంజయ్‌ను కోర్టుకు లాగుతామని కేటీఆర్ హెచ్చరిక జారీ చేశారు. బండి సంజయ్ చేసిన ఆరోపణల్లో ఒక్క శాతం నిజం ఉందని నిరూపించాలని కేటీఆర్ సవాల్ విసిరారు. కేంద్ర మంత్రిగా పనిచేస్తున్న బండి సంజయ్‌కి నిఘా వ్యవస్థ ఎలా పని చేస్తుందో అనే అంశంలో కనీస అవగాహన లేదన్నారు. నిఘా వ్యవస్థల నిర్వాహణపైన కనీస పరిజ్ఞానం కూడా లేదన్నారు. ఫోన్ టాపింగ్ వ్యవహారంలో బండి సంజయ్ అబద్దాలు, అనుచిత వ్యాఖ్యలు, ప్రకటనలు అన్ని హద్దులు దాటాయన్నారు. ఇంత దిగజారుడు ఆరోపణలు, చిల్లర మాటలు, బజారు మాటలు మాట్లాడడం బండి సంజయ్ కి అలవాటుగా మారిందన్నారు. ఆయన ఫోన్ టాపింగ్ వ్యవహారంలో మాట్లాడిన ప్రతిసారి మరింత దిగజారి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బాధ్యత కలిగిన కేంద్ర మంత్రిగా పనిచేయడం అంటే ఢిల్లీ బాసుల చెప్పులు మోసినంత ఈజీ కాదని బండి సంజయ్ కి ఇప్పటికైనా తెలుసుకుంటే మంచిదన్నారు. కేవలం తనకు రాజకీయ ప్రాధాన్యత దక్కకపోవడంతోనే.. కేవలం వార్తల్లో నిలవాలని తనకు అలవాటైన చౌకబారు వీధి నాటకాలకు తెరలేపిందన్నారు.

బండి సంజయ్ మాట్లాడుతూ.. కేసీఆర్, కేటీఆర్, సంతోష్ మినహా బీఆర్ఎస్ నేతల ఫోన్లన్నీ ట్యాప్ అయ్యాయన్నారు. సొంత కూతురు ఫోన్లను కూడా ట్యాప్ చేసిన నీచులు కేసీఆర్.. సాక్షాత్తు సీఎం రేవంత్ రెడ్డి కూడా బాధితుడే కదా.. రేవంత్ రెడ్డి ఎందుకు సిట్ విచారణకు హాజరు కావడం లేదు.? అంటూ ప్రశ్నించారు. 6 వేల 500 మంది ఫోన్లను కేసీఆర్ ప్రభుత్వం ట్యాప్ చేసిందని ఆరోపించారు. నాతోపాటు రేవంత్ రెడ్డి, హరీష్ రావుసహా ఆనాటి మంత్రుల, బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫోన్లను కూడా ట్యాప్ చేశారు.. నా ఫోన్ ను ప్రతి క్షణం ట్యాప్ చేశారని సంచలన ఆరోపణలు చేశారు.

## రుచిగా ఉన్నాయని 'ఫ్రెంచ్ ఫ్రైస్' లాగించేస్తున్నారా..?



**హైదరాబాద్ పెన్ పవర్:**చాలామంది ఫాస్ట్ ఫుడ్ తినడానికి ఇష్టపడుతున్నారు. మనం స్నేహితులతో కలిసి తిరుగుతున్నా లేదా చిన్న పార్టీ చేసుకున్నా, ఆఫీసులో సహోద్యోగులతో టీ తాగినా, ముందుగా ఆర్డర్ చేసుకునేది ఫాస్ట్ ఫుడ్. వాటిలో వేగంగా తయారై టేబుల్‌పైకి వచ్చేది ఫ్రెంచ్ ఫ్రైస్. ఇవి బంగాళదుంపల నుండి తయారవుతాయి. వీటిని అధికంగా తీసుకుంటే.. మన ఆరోగ్యానికి అనేక విధాలుగా హాని కలిగిస్తాయి. క్రమం తప్పకుండా ఈ ఫాస్ట్ ఫుడ్ తీసుకుంటే.. వ్యాధులకు గురవుతారు. ప్రతి వారం మూడు ప్లేట్ల ఫ్రెంచ్ ఫ్రైస్ తినడం వల్ల టైప్-2 డయాబెటిస్ రిస్క్ 20% పెరుగుతుందని ఒక పరిశోధన వెల్లడించింది. అదే సమయంలో మీరు అదే పరిమాణంలో ఉడికించిన.. కాల్చిన లేదా మెత్తని బంగాళాదుంపలను తింటే ఈ ప్రమాదం అంతగా పెరగదు. ఈ పరిశోధన బ్రిటిష్ మెడికల్ జర్నల్‌లో ప్రచురించబడింది. హార్వర్డ్, కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయ పరిశోధకుల ఈ స్టడీలో రెండు లక్షల మందికి పైగా పాల్గొన్నారు. ఫ్రెంచ్ ఫ్రైస్ తినే వ్యక్తులను కొన్ని ప్రశ్నలు అడిగారు. పరిశోధన ప్రారంభంలో ఎవరికీ మధుమేహం, గుండె జబ్బులు లేదా క్యాన్సర్ లేదు. ఈ వ్యక్తులను 40 సంవత్సరాల పాటు పర్యవేక్షించిన తరువాత.. 22,000 మందికి పైగా టైప్-2 డయాబెటిస్‌ను అభివృద్ధి చేసినట్లు కనుగొనబడింది. అయితే పీచు, విటమిన్ సి, మెగ్నీషియం వంటి అనేక పోషకాలు బంగాళదుంపలో ఉంటాయి. అవి అధిక మొత్తంలో స్టార్చ్ కలిగి ఉంటాయి. వాటి గ్లైసెమిక్ సూచిక కూడా చాలా ఎక్కువగా ఉంటుంది, ఇది మధుమేహం ప్రమాదాన్ని పెంచుతుంది.

బంగాళదుంపలను వంటలలో వాడే విధానం కూడా ఆరోగ్యంపై చాలా ప్రభావం చూపుతుందని పరిశోధకులు తెలిపారు. సాధారణ బంగాళదుంపలను వారానికి మూడుసార్లు తినడం వల్ల మధుమేహం వచ్చే ప్రమాదం 5% పెరుగుతుందని పరిశోధనలో తేలింది. ఎవరైనా వారానికి మూడు

సార్లు ఫ్రెంచ్ ఫ్రైస్ తింటే.. ఈ ప్రమాదం 20% పెరుగుతుంది. అదనంగా, మీరు ఫ్రెంచ్ ఫ్రైస్‌కు బదులుగా మూడు సేర్విన్స్ తృణధాన్యాలు తింటే, మధుమేహం వచ్చే ప్రమాదం 19% తగ్గుతుంది.

## పులివెందులలో టీడీపీ ఫ్లెక్సీలను తగులబెట్టిన దుండగులు

- జడ్పీటీసీ ఉప ఎన్నిక నేపథ్యంలో రణరంగంగా మారిన పులివెందుల
- పరస్పర దాడులు చేసుకుంటున్న టీడీపీ, వైసీపీ శ్రేణులు
- కొత్తపల్లి రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన టీడీపీ ఫ్లెక్సీకి నిప్పంటించిన దుండగులు




**హైదరాబాద్ పెన్ పవర్:**పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నిక ఏపీ వ్యాప్తంగా ఉత్కంఠను రేపుతోంది. వైఎస్ కుటుంబానికి పులివెందుల కంచుకోట కావడంతో ఎన్నికలో గెలుపు కోసం టీడీపీ, వైసీపీ సర్వశక్తులు ఒడ్డుతున్నాయి. రెండు పార్టీలకు చెందిన కీలక నేతలు ప్రచార పర్వంలో బిజీగా ఉన్నారు. ఈ క్రమంలో పులివెందుల రణరంగంగా మారింది. ఇరు పార్టీల శ్రేణులు పరస్పర దాడులు కూడా చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో ఇరు పార్టీల నేతలపై కేసులు కూడా నమోదయ్యాయి.

మరోవైపు, టీడీపీ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను గుర్తు తెలియని దుండుగులు ఈ ఉదయం తగులబెట్టారు. పులివెందుల మండలం కొత్తపల్లి రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలకు నిప్పంటించారు. టీడీపీ నేత బీటెక్ రవి, ఆయన భార్య, టీడీపీ అభ్యర్థి లతారెడ్డిలతో పాటు జిల్లా నేతలతో కూడిన ఫ్లెక్సీని తగులబెట్టారు. ఈ ఘటనపై టీడీపీ శ్రేణులు పులివెందుల పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## నిండుకుండలా హుస్సేన్ సాగర్




**హైదరాబాద్ పెన్ పవర్:** మొన్న రాత్రి హైదరాబాద్ లో భారీ వర్షం కురిసిన సంగతి తెలిసిందే. దీంతో నగరం మొత్తం వర్షపు నీరు పోటెత్తింది. ఈ క్రమంలో కూకట్ పల్లి, బేగంపేట్, ఖైరతాబాద్ వైపు నుంచి హుసేన్ సాగర్ కు భారీగా వరద నీరు వచ్చి చేరింది. దీంతో, హుస్సేన్ సాగర్ నిండుకుండలా మారింది. హుస్సేన్ సాగర్ పూర్తి స్థాయి నీటిమట్టం 514 మీటర్లు కాగా... ఈ మధ్యాహ్నం నీటిమట్టం 513.63 మీటర్లకు చేరుకుంది. ప్రస్తుతం సాగర్ కు 1,234 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా... ఔట్ ఫ్లో 1,523 క్యూసెక్కులుగా ఉంది. నీటిని దిగువకు వదులుతున్న నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

# ఇంటి నుంచి పారిపోయిన అక్క.. చెల్లిని పెళ్లిచేసుకుని తిరిగొచ్చింది!

- ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్ నగర్‌లో ఘటన
- ఇంటి నుంచి అదృశ్యమై సోదరిని పెళ్లాడిన యువతి
- తాము ఏడాది కాలంగా ప్రేమించుకుంటున్నట్టు చెప్పిన వైనం
- ఇంట్లో చెబితే ఒప్పుకోరనే పెళ్లి చేసుకున్నట్టు చెప్పిన యువతి
- పోలీసులు చెప్పినా నిర్ణయాన్ని మార్చుకోని యువతులు




**హైదరాబాద్ పెన్ పవర్:**ఉత్తరప్రదేశ్‌లో ఒక వింత సంఘటన చోటుచేసుకుంది. తప్పిపోయిన యువతిని వెతుకుతున్న కుటుంబానికి ఊహించని షాక్ ఎదురైంది. ఇంటి నుంచి వెళ్లిపోయిన ఓ యువతి తన సోదరి వరసైన మరో అమ్మాయిని వివాహం చేసుకుంది. ఇకపై తాము భార్యాభర్తలుగా కలిసి జీవిస్తామని చెప్పడంతో పోలీసులు, కుటుంబ సభ్యులు విస్మయానికి గురయ్యారు. ముజఫర్‌నగర్‌కు చెందిన ఒక యువతి ఇటీవల ఇంటి నుంచి అదృశ్యమైంది. తన కుమార్తె కిడ్నాప్‌కు గురై ఉంటుందని అనుమానించిన ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు యువతి ఆచూకీ గుర్తించారు. భద్రత కల్పిస్తామని హామీ ఇవ్వడంతో ఇటీవల ఆమె పోలీస్ స్టేషన్‌కు వచ్చింది.

అయితే, ఆమె ఒంటరిగా కాకుండా, వరుసకు చెల్లి అయ్యే మరో అమ్మాయితో కలిసి పెళ్లి దుస్తుల్లో పోలీస్ స్టేషన్‌కు వచ్చింది. తాము వివాహం చేసుకున్నామని, ఇకపై భార్యాభర్తలుగా కలిసి జీవిస్తామని చెప్పడంతో పోలీసులు, కుటుంబ సభ్యులు షాక్ తిన్నారు. తానే వరుడిగా మారి తన చెల్లిని వివాహం చేసుకున్నట్టు ఆ యువతి పోలీసులకు వివరించింది. తాము గత ఏడాది కాలంగా ప్రేమించుకుంటున్నామని, తమ ప్రేమను కుటుంబ సభ్యులు అంగీకరించకపోవడంతో పారిపోయి వివాహం చేసుకున్నామని ఆ ఇద్దరు యువతులు పోలీసులకు తెలిపారు. వారు తిరిగి ఇళ్లకు వెళ్లేలా అధికారులు నచ్చజెప్పడానికి ప్రయత్నించినప్పటికీ వారు తమ నిర్ణయాన్ని మార్చుకోవడానికి నిరాకరించారు.

# ఉత్తర కాశీ ప్రమాదంలో ఇస్రో సాయం.. శాటిలైట్ చిత్రాలతో రెస్క్యూ

- ధరాలీ గ్రామాన్ని ముంచెత్తిన వరద
- రెస్క్యూ కార్యక్రమాల్లో ఉపయోగకరంగా శాటిలైట్ చిత్రాలు
- ఇస్రో సహకారంతో వేగంగా కొనసాగుతున్న రెస్క్యూ ఆపరేషన్




**హైదరాబాద్ పెన్ పవర్:**ఉత్తర కాశీ జిల్లాలోని ధరాలీ గ్రామాన్ని ఇటీవల వరద ముంచెత్తిన విషయం తెలిసిందే. ఖీర్ గడ్, భాగీరథీ నదులు ఉప్పొంగడంతో వరద నీరు ఒక్కసారిగా గ్రామాన్ని ముంచెత్తాయి. పర్వత ప్రాంతాల్లోని ధరాలీ గ్రామం బురదలో కూరుకుపోయింది. వరదలో కొన్ని ఇండ్లు కొట్టుకుపోగా మరికొన్నింటిని బురద ముంచెత్తింది. ఈ ఘోర ప్రమాదంలో ఐదుగురు చనిపోయినట్లు ప్రకటించిన అధికారులు వంద మందికి పైగా గల్లంత య్యారని వెల్లడించారు. ఈ క్రమంలో గల్లంతైన వారిని గుర్తించేందుకు రెస్క్యూ కొనసాగుతోంది. రెస్క్యూ పనుల్లో అధికారులు భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) సహకారం తీసుకుంటున్నారు. శాటిలైట్ చిత్రాల ఆధారంగా గతంలో గ్రామంలోని భవనాలు ఉన్న ప్రాంతాల్లో తవ్వకాలు జరుపుతూ గాలిస్తున్నారు. బురదలో చిక్కుకున్న వారిని గుర్తించేందుకు ఈ చిత్రాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని చెబుతున్నారు. రెస్క్యూ ఆపరేషన్ కు అవసరమైన అత్యాధునిక పరికరాలను యుద్ధప్రాతిపదికన విమానాల్లో ధరాలీ గ్రామానికి తరలిస్తున్నట్టు వివరించారు. గంగోత్రికి వెళ్లే యాత్రికులు మార్గమధ్యంలో ధరాలీ గ్రామంలో ఆగుతుండడం రివాజు. ఈ క్రమంలో కొండచరియలు విరిగిపడడం, వరదల కారణంగా పలు రోడ్లు మూతపడి పలువురు యాత్రికులు చిక్కుకుపోయారని అధికారులు తెలిపారు. వారిని సురక్షితంగా తరలించడానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు వివరించారు.

# ఫేస్‌బుక్ స్నేహం.. రూ.8.7 కోట్ల మోసం.. వృద్ధుడిని ఆసుపత్రిపాలు చేసిన ప్రేమ వల!

- ఫేస్‌బుక్ పరిచయంతో 80 ఏళ్ల వృద్ధుడికి భారీ మోసం
- నలుగురు మహిళల పేరుతో రెండేళ్ల పాటు సాగిన వల
- 734 లావాదేవీల్లో ఏకంగా రూ. 8.7 కోట్లు స్వాహా
- కొడుకును డబ్బు అడగడంతో బయటపడ్డ అసలు నిజం
- షాక్‌తో ఆసుపత్రి పాలైన బాధితుడు, డిమెన్షియా నిర్ధారణ




**హైదరాబాద్ పెన్ పవర్:**ఆన్‌లైన్‌లో అపరిచితుల పట్ల ఎంత జాగ్రత్తగా ఉండాలో చాటిచెప్పే దారుణ ఘటన ముంబయిలో వెలుగుచూసింది. ఫేస్‌బుక్‌లో పరిచయమైన మహిళల ప్రేమ, సానుభూతి వలలో చిక్కుకున్న 80 ఏళ్ల వృద్ధుడు ఏకంగా రూ.8.7 కోట్ల వరకు పోగొట్టుకున్నారు. దాదాపు రెండేళ్ల పాటు 734 ఆన్‌లైన్ లావాదేవీల ద్వారా ఈ భారీ మోసం జరిగింది. చివరికి ఈ షాక్‌తో బాధితుడు ఆసుపత్రి పాలవ్వగా, ఆయనకు డిమెన్షియా ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు.

**అసలేం జరిగిందంటే..!**

2023 ఏప్రిల్‌లో బాధితుడైన వృద్ధుడు ఫేస్‌బుక్‌లో షార్వి అనే మహిళకు ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపారు. అయితే ఆమె యాక్సెప్ట్ చేయలేదు. కొద్దిరోజుల తర్వాత ఆమె నుంచే రిక్వెస్ట్ రావడంతో ఆయన ఇంకేమీ ఆలోచించకుండా యాక్సెప్ట్ చేశారు. అక్కడి నుంచి వాట్సాప్‌లో వారి సంభాషణలు మొదలయ్యాయి. తాను భర్త నుంచి విడిపోయానని, పిల్లల ఆరోగ్యం బాగోలేదని నమ్మబలికిన షార్వి, నెమ్మదిగా డబ్బు అడగడం ప్రారంభించింది. ఆమె మాటలు నమ్మిన వృద్ధుడు డబ్బు పంపడం మొదలుపెట్టారు.

కొద్ది రోజులకే, షార్వి స్నేహితురాలినంటూ కవిత అనే మరో మహిళ రంగంలోకి దిగింది. అసభ్యకర సందేశాలు పంపుతూ ఆమె కూడా డబ్బు డిమాండ్ చేసింది. ఆ తర్వాత, షార్వి సోదరినంటూ డైనాజ్ అనే మహిళ పరిచయమైంది. షార్వి చనిపోయిందని, ఆసుపత్రి బిల్లులు కట్టాలని కోరింది. పాత వాట్సాప్ చాట్‌లను చూపించి బెదిరించి డబ్బు గుంజిం?ది. డబ్బు తిరిగి ఇవ్వాలని అడిగితే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించింది. చివరగా, డైనాజ్ స్నేహితురాలినంటూ జాస్మిన్ కూడా సహాయం పేరుతో డబ్బు వసూలు చేసింది. ఇలా 2023 ఏప్రిల్ నుంచి 2025 జనవరి మధ్య కాలంలో బాధితుడు మొత్తం 734 లావాదేవీల ద్వారా రూ. 8.7 కోట్లు బదిలీ చేశారు. తన ఆస్తంతా అయిపోవడంతో కోడలి దగ్గర రూ. 2 లక్షలు అప్పు చేశారు. అయినా వేధింపులు ఆగకపోవడంతో తన కొడుకును రూ. 5 లక్షలు అడిగారు. దాంతో ఆయనకు అనుమానం వచ్చింది. తండ్రిని నిలదీయగా అసలు విషయం బయటపడింది. తాను మోసపోయానని గ్రహించిన వృద్ధుడు తీవ్ర షాక్‌కు గురై ఆసుపత్రిలో చేరగా, వైద్యులు ఆయనకు డిమెన్షియా ఉన్నట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై గత నెల 22న సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు అందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ నలుగురు మహిళల పాత్రల వెనుక ఉన్నది ఒక్కరే అయి ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

# వెనెజువెలా అధ్యక్షుడిపై అమెరికా రూ.430 కోట్ల రివార్డు

- మదురో అరెస్టుకు సహకరిస్తే 50 మిలియన్ డాలర్ల బహుమానం
- అమెరికాలో డ్రగ్స్ వ్యాప్తికి ప్రయత్నిస్తున్నారని మదురోపై ఆరోపణ
- మదురో, ఆయన సన్నిహితులకు సంబంధించిన 30 టన్నుల కొకైన్ సీజ్ చేశామన్న అమెరికా
- ప్రైవేట్ జెట్‌లు సహా 700 మిలియన్ డాలర్ల విలువైన ఆస్తుల స్వాధీనం




**హైదరాబాద్ పెన్ పవర్:**అమెరికాలో డ్రగ్స్ వ్యాప్తిని, హింసను ప్రేరేపించేందుకు ప్రయత్నిస్తున్నారంటూ వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోపై అగ్రరాజ్యం మండిపడుతోంది. ఈ ఆరోపణలతో మదురోను అరెస్టు చేయాలని ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలోనే మదురో అరెస్టుకు సహకరిస్తే ఏకంగా 50 మిలియన్ డాలర్లు (రూపాయల్లో దాదాపు 430 కోట్లు) ముట్టజెబుతామంటూ సంచలన ప్రకటన చేసింది. డొనాల్డ్ ట్రంప్ ఫస్ట్ టర్మ్ లో ఈ నజరానా 15 మిలియన్ డాలర్లు ఉండగా.. జో బైడెన్ ప్రెసిడెంట్ అయ్యాక ఈ రివార్డును 25 మిలియన్ డాలర్లకు పెంచారు. తాజాగా ఈ మొత్తాన్ని 50 మిలియన్ డాలర్లకు పెంచుతున్నట్లు అమెరికా అటార్నీ జనరల్ పామ్ బాండీ ఎక్స్‌లో ఓ వీడియో పోస్టు చేశారు. 'అమెరికాలో డ్రగ్స్ వ్యాప్తికి, హింసను ప్రేరేపించేందుకు నికోలస్ మదురో ట్రెన్ డె అరాగువా, సినలో, కార్టల్ ఆఫ్ ది సన్స్ వంటి వాటిని వినియోగిస్తున్నారు” అని పామ్ బాండీ ఆరోపించారు. ఇప్పటివరకు నికోలస్ మదురోకు సంబంధించిన 7 టన్నుల కొకైన్ తో పాటు ఆయన సన్నిహితులకు సంబంధించిన 23 టన్నుల కొకైన్‌ను డ్రగ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడ్మినిస్ట్రేషన్ సీజ్ చేసిందని బాండీ వెల్లడించారు. వెనెజువెలా, మెక్సికోలలోని డ్రగ్ మాఫియాకు ఇదే ప్రధాన ఆదాయ వనరుగా మారిందన్నారు.

ఫెంటెనిల్ స్మగ్లింగ్‌తో కూడా మదురోకు సంబంధాలున్నాయని బాండీ పేర్కొన్నారు. ఇప్పటికే 2020 మార్చిలో ఆయనపై దక్షిణ న్యూయార్క్ డిస్ట్రిక్ట్‌లో కేసులు నమోదైనట్లు చెప్పారు. కాగా, మదురోకు సంబంధించిన ప్రైవేట్ జెట్ లు, తొమ్మిది వాహనాలు సహా 700 మిలియన్ డాలర్ల విలువైన ఆస్తులను అమెరికాలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్ సీజ్ చేసింది.

# రక్షాబంధన్ కానుక.. సిలిండర్‌కు రూ.300 సబ్సిడీ.. రూ.12,000 కోట్లు కేటాయించిన కేంద్రం




**హైదరాబాద్ పెన్ పవర్:**ఉజ్వల పథకం కింద ఎల్‌పిజి కొనుగోలులో సబ్సిడీ కోసం రూ.12,000 కోట్లకు ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని క్యాబినెట్ కమిటీ శుక్రవారం ఆమోదం తెలిపింది.

రక్షాబంధన్ కానుక.. సిలిండర్‌కు రూ.300 సబ్సిడీ.. రూ.12,000 కోట్లు కేటాయించిన కేంద్రంఉజ్వల పథకం కింద ఎల్‌పిజి కొనుగోలులో సబ్సిడీ కోసం రూ.12,000 కోట్లకు ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని క్యాబినెట్ కమిటీ శుక్రవారం ఆమోదం తెలిపింది. ఈ మొత్తాన్ని ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26లో ఇవ్వబోయే సబ్సిడీకి వినియోగిస్తారు. గ్యాస్ కనెక్షన్లు ఉన్న 10.33 కోట్ల మందికి దీని ప్రయోజనం ఉంటుంది.

ప్రధాన మంత్రి ఉజ్వల యోజన కింద.. ప్రభుత్వం ఏడాదికి 14.2 కిలోల బరువున్న తొమ్మిది సిలిండర్లను కొనుగోలు చేయడానికి సిలిండర్‌కు రూ. 300 సబ్సిడీ ఇస్తుంది. పెట్రోలియం కంపెనీలకు ప్రభుత్వం ఈ సబ్సిడీని ఇస్తుంది. ఉజ్వల పథకం కింద.. మొదటిసారి గ్యాస్ కనెక్షన్ తీసుకునే వారికి ప్రభుత్వం ఉచితంగా గ్యాస్ స్టవ్‌ను కూడా అందిస్తుంది. అంతర్జాతీయంగా గ్యాస్ ధర పెరిగిన దృష్ట్యా.. సిలిండర్ల కొనుగోలుపై వినియోగదారులకు పెద్దగా భారం పడకుండా ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుంది. దేశీయ ఎల్‌పీజీని తక్కువ ధరకు విక్రయించడం వల్ల పెట్రోలియం కంపెనీల నష్టాన్ని భర్తీ చేసేందుకు రూ.30,000 కోట్లను కేబినెట్ కమిటీ శుక్రవారం ఆమోదించింది. ఈ మొత్తం పెట్రోలియం మంత్రిత్వ శాఖ ద్వారా 12 దశల్లో %×ూజూ, ద్రీజూ, ూూజూ%లకు చెల్లించబడుతుంది. మంత్రిత్వ శాఖ ప్రకారం.. గత ఆర్థిక సంవత్సరంలో 2024-25లో ఎల్‌పిజి అంతర్జాతీయ ధర చాలా ఎక్కువగా ఉంది. అయితే ఎల్‌పీజీ ధరల పెంపు భారం వినియోగదారులపై పడకపోవడంతో ఈ మూడు కంపెనీలు భారీ నష్టాలను చవిచూడాల్సి వచ్చింది. దీనికి పరిహారంగా రూ.30 వేల కోట్లు మంజూరు చేసింది.

# సరిపోయింది.. 2 రూపాయల రాఖీని ఇలా చేసి 50, 100 రూపాయలకు అమ్ముతున్నారా..?

**హైదరాబాద్ పెన్ పవర్:**'రక్షా బంధన్' వచ్చేసింది. రాఖీల అమ్మకాలతో వీధుల ముందు దుకాణాలు వెలిశాయి. అయితే.. 2 రూపాయలు ఖరీదు మాత్రమే ఉన్న రాఖీని 50 రూపాయలకు అమ్ముతూ కొందరు వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్న విషయం తాజాగా బయటపడింది. ఒక వీడియో రాఖీలు కొనడానికి వెళ్లిన అక్కచెల్లెమ్మల కళ్లు తెరిపించింది. ఒక రాఖీ హోల్ సేలర్ ఈ విషయాన్ని బయటపెట్టడం ఇక్కడ పెద్ద ట్విస్ట్. 2 రూపాయల రాఖీని ఫ్యాన్సీ ప్యాకేజింగ్ చేసి 10 రూపాయలు, 50 రూపాయలు, 100 రూపాయలకు అమ్ముతున్న బాగోతం ఇది. ఆ కిటుకు ఏంటనేది కూడా ఈ వీడియోలో ఆ వ్యక్తి స్పష్టంగా పూసగుచ్చినట్లు వివరించాడు. కస్టమర్లు ఇలా అమాయకంగా కొంటున్నారు కాబట్టే మన దేశంలో రక్షా బంధన్ వచ్చిన ప్రతిసారి 10 వేల కోట్లకు పైగా బిజినెస్ నడుస్తోందని ఒక నెటిజన్ అభిప్రాయపడ్డాడు. రాఖీలు కొని అన్నదమ్ములపై అభిమానాన్ని వ్యక్తం చేయడం మంచిదే కానీ ఖరీదైన రాఖీలు కొంటున్నప్పుడు ఒకటికి




రెండు సార్లు ఆ రాఖీ అంత విలువకు తగినదో.. కాదో ఆలోచించి కొనాలని నెటిజన్లు సూచిస్తున్నారు. అన్నదమ్ములపై తోబుట్టువుల ప్రేమ, అభిమానం వెలకట్టలేనిదని.. అందువల్ల కట్టే రాఖీ ఖరీదైందే కానక్కర్లేదని నెటిజన్లు కొందరు అభిప్రాయపడ్డారు. మన పండుగలన్నింటిలో తోబుట్టువులు ప్రేమానుబంధాలతో జరుపుకొనేది రాఖీ పండుగే. రాఖీ కట్టిన సోదరికి కలకాలం రక్షగా ఉంటానని సోదరుడు భరోసా ఇస్తాడు. శ్రావణ మాస పౌర్ణమి రోజున జరుపుకునే ఈ పండుగను దేశంలోని ఒక్కో ప్రాంతంలో ఒక్కో పేరుతో జరుపుకుంటుంటారు. తెలుగు రాష్ట్రాల్లో శ్రావణ పౌర్ణమినే జంధ్యాల పౌర్ణమిగా కూడా జరుపుకుంటారు. బ్రాహ్మణ, విశ్వబ్రాహ్మణ, వైశ్య, పద్మశాలీ తదితర కమ్యూనిటీలకు చెందిన వ్యక్తులు జంధ్యాలు ధరిస్తుంటారు. పాతవి ఉంటే వాటి స్థానంలో కొత్తవాటిని ధరిస్తుంటారు.

అన్నదమ్ముళ్ల కోసం అక్కా చెల్లెల్లు పుట్టింటికి ప్రయాణమయ్యారు. చదువులు, ఉద్యోగాలు, కుటుంబ బాధ్యతలకు కాస్త గ్యాప్? ఇచ్చి వివిధ ప్రాంతాల నుంచి సొంతూరు బాట పట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా రాఖీ పండుగ కళ సంతరించుకుంది. ప్రధాన బస్టాండ్లు, రైల్వే స్టేషన్లన్నీ ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. పుట్టింటికి వెళ్లడం వీలుకాని అక్కాచెల్లెళ్లు ఆర్టీసీ కార్గోలు, ఇతర కొరియర్ల ద్వారా అన్నదమ్ములకు రాఖీలు పంపించి, తమ అనుబంధాన్ని చాటుకుంటున్నారు.

## 'రుద్రాస్త్ర' రికార్డ్... ఈ గూడ్స్ రైలు పొడవు నాలుగున్నర కిలోమీటర్లు!

- భారత రైల్వే చరిత్రలో సరికొత్త అధ్యాయం
- 'రుద్రాస్త్ర' పేరుతో దేశంలోనే అత్యంత పొడవైన గూడ్స్ రైలు
- ఏకంగా 4.5 కిలోమీటర్ల పొడవు, 354 వ్యాగన్లు, 7 ఇంజిన్లు
- విజయవంతంగా 200 కిలోమీటర్ల దూరం ప్రయాణం
- రవాణా సామర్థ్యం పెంచేందుకే ఈ మెగా ప్రయోగం
- ప్రయోగాన్ని ప్రశంసించిన కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్



**హైదరాబాద్ పెన్ పవర్:**భారతీయ రైల్వే తన చరిత్రలోనే ఓ అద్భుతమైన రికార్డును సృష్టించింది. దేశంలోనే అత్యంత పొడవైన గూడ్స్ రైలును విజయవంతంగా నడిపి రవాణా రంగంలో సరికొత్త అధ్యాయానికి తెరతీసింది. 'రుద్రాస్త్ర' పేరుతో పిలుస్తున్న ఈ భారీ రైలు ఏకంగా 4.5 కిలోమీటర్ల పొడవుతో అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఈస్ట్ సెంట్రల్ రైల్వే పరిధిలోని పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ డివిజన్ ఈ ఘనతను సాధించింది. గురువారం (ఆగస్టు 7) గంజ్ కవాజా స్టేషన్ నుంచి గర్వా రోడ్ స్టేషన్ వరకు 200 కిలోమీటర్ల దూరాన్ని ఈ రైలు కేవలం ఐదు గంటల్లోనే పూర్తి చేసింది. ఆరు ఖాళీ బాక్సన్ ర్యాక్‌లను అనుసంధానించి ఈ మెగా రైలును సిద్ధం చేశారు. మొత్తం 354 వ్యాగన్లు, 7 ఇంజిన్ల సహాయంతో ఇది గంటకు సగటున 40 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించింది. ఈ ప్రయోగం విజయవంతం కావడం వల్ల ఒకేసారి పెద్ద మొత్తంలో సరుకు రవాణా చేసే సామర్థ్యం పెరుగుతుందని ఈస్ట్ సెంట్రల్ రైల్వే పేర్కొంది. దీనివల్ల సమయం, మానవ వనరులు ఆదా కావడమే కాకుండా, రైల్వే ట్రాక్‌లపై రద్దీ తగ్గి మరిన్ని రైళ్లను నడిపేందుకు వీలు కలుగుతుందని అధికారులు వివరించారు.

ఈ అద్భుత ప్రయోగానికి సంబంధించిన వీడియోను కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తన 'ఎక్స్' ఖాతాలో పంచుకున్నారు. ఈ ఘనత సాధించిన రైల్వే బృందాన్ని ఆయన అభినందించారు. ఈ రికార్డుతో భారత రైల్వే సరకు రవాణా సామర్థ్యంలో మరో మైలురాయిని అధిగమించినట్లయింది.

## రాఖీ పండగకు ఊరెళ్తున్నారా.. హైదరాబాద్‌లో వర్షం స్టార్ట్.. ఈ ఏరియాల్లో వెళ్లే వాళ్లు జగ్రత్త !




**హైదరాబాద్ పెన్ పవర్:**హైదరాబాద్ లో వర్షం స్టార్టయింది. శుక్రవారం (ఆగస్టు 08) పగలంతా పొడి వాతావరణంతో, అప్పుడప్పుడు ఎండ కాస్తూ కనిపించిన వెదర్.. సాయంత్రం చల్లబడింది. రాత్రి పది గంటల ప్రాంతంలో నగరంలో వర్షం మొదలైంది. అక్కడక్కడ చిరుజల్లులతో మొదలైన వాన.. భారీ వర్షంగా మారుతుండటంతో నగరవాసులు ఇబ్బందులు గురవుతున్నారు. దిల్ సుఖ్ నగర్ లో భారీ వర్షం కురుస్తోంది. ఉన్నట్లుండి ఒక్కసారిగా వర్షం మొదలవ్వటంతో షటర్ల కిందికి పరిగెత్తారు. మరోవైపు శనివారం (ఆగస్టు 09) రాఖీ పండుగ సందర్భంగా నగరవాసులు సొంతూళ్లకు బయల్దేరుతున్నారు. అదే సమయంలో వర్షం స్టార్టవ్వడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. దిల్ సుఖ్ నగర్ తో పాటు మలక్ పేట్, చంపాపేట్ లో భారీ వర్షం కురుస్తోంది.

మరోవైపు చార్మినార్, సైదాబాద్, మలక్‌పేట్, ఎంజీబీఎస్, కోఠి, బహదూర్‌పురా, శాలిబండ, గౌలిగూడ, బండ్లగూడ, నాంపల్లి, అంబర్‌పేట్ సహా పలు ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది. అటు మీర్ పేట్, బాలాపూర్, బడంగ్ పేట్ పరిసర ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది. వర్షం మెల్లమెల్లగా చుట్టుపక్కల ప్రాంతాలకు కూడా విస్తరించే ప్రమాదం ఉండటంతో నగరవాసులు బయటకు రాకపోవడం మంచిదని చెబుతున్నారు వాతావరణ కేంద్రం అధికారులు.